www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం జులై 18 2024
5
చిత్తూరు



నేడు డయల్ యువర్ ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నియోజకవర్గ పరిధిలో 18వ తేదీ (గురువారం) చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఆధ్వర్యంలో 'డయల్ యువర్ ఎమ్మెల్యే' కార్యక్రమం జరుగుతుందని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ తెలిపారు. 'డయల్ యువర్ ఎమ్మెల్యే' కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజలు ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య 98499 07885 నంబర్‌కు ఫోన్‌చేసి తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావచ్చని చెప్పారు. ఈకార్యక్రమానికి చిత్తూరు నగరపాలకతో పాటు చిత్తూరు రూరల్, అర్బన్, గుడిపాల మండలాల అధికారులు హాజరు కావాలన్నారు. గతవారం నిర్వహించిన 'డయల్ యువర్ ఎమ్మెల్యే' కార్యక్రమంలో అందిన ఫిర్యాదుల స్థితికి సంబంధించి నివేదిక సమర్పించాలన్నారు.

కనికరం చూపాల్సిన వారే..

కాటేస్తున్నారు



- వరసుగా మైనర్లపై లైంగిక దాడులు
- బెంబేలెత్తుతున్న ఆడపిల్లల తల్లిదండ్రులు

మానవత్వం మచ్చుకైనా కనిపించడం లేదు. ఏ పుట్టలో ఏ పాము ఉందో తెలియనట్టుగా.. ఎవరి మనసులో ఎలాంటి దుర్బుద్ధి ఉందో తెలుసుకోవడం కష్టసాధ్యంగా మారింది. కనికరించాల్సిన వారే కాటేస్తున్న సమాజంలో మానవత్వం మంటకలుస్తోంది. వావి వరసలు మరిచి అభం శుభం తెలియని చిన్నారులపై లైంగిక వేధింపులు, దాడులకు పాల్పడుతున్నారు. ఈ మానవ మృగాలు మనుషుల మధ్యలోనే ఉంటూ జంతువుల్లా ప్రవర్తిస్తున్నారు. దీంతో ఎవరిని నమ్మాలో ఎవరిని నమ్మకూడదో పాలు పోవడం లేదు. ఆరు నెలల చిన్నారిపై వరుసకు తాతయ్యే దుర్మార్గుడు చేసిన దాడే ఇందుకు నిదర్శనం.

ప్రజాశక్తి -పూతలపట్టు: ఒకవైపు తోటి విద్యార్థులే లైంగిక దాడులకు పాల్పడుతుంటే.. మరోవైపు వావి వరసలు మాని వయస్సుతో నిమిత్తం లేకుండా అభం శుభం తెలియని చిన్నారులపై లైంగిక దాడులు.. వీధుల్లో పిల్లలు ఒంటరిగా కనిపిస్తే మానవ మృగాల దాడులు.. ఇలా గత పది రోజుల్లోనే వరుస అగాయిత్యాలు రాష్ట్ర ప్రజలను హడలెత్తిస్తున్నాయి. ఆడబిడ్డల తల్లిదండ్రులకు కంటిమీద కునుకు లేకుండా పోతుంది. పనులు వదులుకొని కాపలా కాస్తూ తమ పిల్లలను రక్షించుకోవాల్సిన పరిస్థితి. పాఠశాలలకు, కళాశాలలకు, ఇతర కార్యక్రమాలకు సైతం తమ పిల్లలను తెలిసిన బంధువులతో పాటు పంపించాలన్న ఆలోచించాల్సిన దుస్థితి నెలకుంది. అయినవారే అఘాయిత్యాలకు పాల్పడుతుంటే ఇక చిన్నారులకు ఎవరు దిక్కెవరు. ఇలాంటి నీచ సమాజంలో పిల్లలు తల్లిదండ్రులు అత్యంత జాగ్రత్తగా ఉండాలి.

పాఠశాలల్లో సైతం...

పాఠశాలల్లో సైతం పిల్లలకు రక్షణ లేకుండా పోతుంది. ఇదివరకే అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయులు పిల్లల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనలు ఎన్నో వెలుగు చూశాయి. పిల్లలు ఇంటి తరువాత బడిలోనే ఎక్కువ సమయం గడుపుతుంటారు. కొన్ని సందర్భాల్లో టీచర్లు పెద్ద తరగతి పిల్లలతో హద్దు మీరే ప్రమాదం ఉంది. సంస్థ ప్రతిష్టకు భంగం కలుగుతుందని భయంతో కొన్ని పాఠశాల యాజమాన్యం కూడా ఇలాంటి ఘటనలు కప్పిపెట్టే ప్రయత్నం చేయవచ్చు. అందుకని బడిని ఎంచుకునే సమయంలోనే అక్కడి చదువు ఆటపాటలతో పాటు క్రమశిక్షణ తీరును గమనించాలి. కేవలం బడి మాత్రమే కాదు ట్యూషన్, కేర్ సెంటర్, ఇలా పిల్లల్ని భరోసాగా వదిలిపెట్టే ప్రతి చోట ఇక్కడ వ్యక్తులు సరైన వారేనా అనే వాకబు చేయాలి.

మాటలతో కూడా చిత్రహింసలు

కొందరు శారీరకంగా అఘాయిత్యాలకు పాల్పడితే మరికొందరు మాటలతోనే శారీరక అనుభూతిని పొందుతారు. అందుచేత మీ ఎదుట పిల్లలతో ఎవరైనా తేడాగా మాట్లాడుతుంటే వెంటనే ఖండించండి. ఒక వయసు వచ్చిన తర్వాత వాళ్ళ మాట సభ్యత కాదని పిల్లలు తెలుసుకుంటారు. తెలిసిన వారు ఎవరైనా అలాంటి బూతు మాటలు మాట్లాడుతున్నట్లు పిల్లలు దృష్టికి వస్తే జాగ్రత్త పడాలి. అలాగే పాఠశాలల్లో తప్పనిసరిగా గుడ్ టచ్ బ్యాడ్ టచ్ లో గురించి ఉపాధ్యాయులు పోలీసులు అవగాహన కల్పించాలి.

సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలి

ప్రస్తుతం పిల్లలు చరవాణికి బానిసలుగా మారుతున్నారు. పాఠశాలల నుంచి ఇంటికి వెళ్ళగానే చరవాణిపై వాలిపోతున్నారు. ఫేస్బుక్ ఇన్స్టాగ్రామ్, వాట్సాప్ తదితర సామాజిక మాధ్యమాల్లో పరిచయం లేని కుతూహలం కలిగించే వీడియోలను చూస్తుంటారు. కొందరు ఏకాంతంగా గదుల్లో చరవాణిలో వీక్షిస్తుంటారు. ఈ క్రమంలో అపరిచిత వ్యక్తులతో పరిచయం పెంచుకోవడం వారితో మాట్లాడడం కుదిరితే బయట కలుసుకోవడం జరుగుతున్నాయి. టీనేజీ ఆడపిల్లలు ఎలాంటి వీడియోలు చూస్తున్నారు వారి ప్రవర్తన ఎలా ఉందో గమనిస్తూ ఉండాలి. అనవసరమైన చాటింగ్లు పరిచయాలు ఉన్నట్లయితే దండించాలి.. వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలి.

ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి..

- వాడ గంగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి



అభం శుభం తెలియని చిన్నారులపై లైంగిక దాడులకు పాల్పడుతున్న మానవ మృగాల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలపై నిరంతరం నిఘ ఉంచాలి. ఒక వయసు వచ్చేవరకు పిల్లలను ఫోన్లకు దూరంగా పెట్టడం ఉత్తమం. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సంఘటనలపై ప్రభుత్వం స్పందించి మరోమారు ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలి. బాధ్యత కుటుంబాలకు అండగా నిలవాలి.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వార్షిక తనిఖీలో భాగంగా బుధవారం కల్లూరు సర్కిల్ పరిధిలోని ఐరాల పోలీస్ స్టేషన్‌ను బుధవారం జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు చిత్తూరు సబ్ డివిజన్ డిఎస్పీ రాజగోపాల్ రెడ్డి సమక్షంలో తనిఖీ చేయడం జరిగింది. పోలీసు స్టేషన్ నిర్వహణ, పరిసర ప్రాంతాలు, సిబ్బంది పనితీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్, వివిధ క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. కొత్త చట్టాలను ప్రతి పోలీస్ స్టేషన్ నందు అమలు పరచాలని, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సర్కిల్ పరిధిలో తీసుకున్న చర్యలను సమీక్షించారు. బ్లాక్‌స్పాట్స్ దగ్గర రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకున్న చర్యలను సమీక్షించారు. రోడ్డు భద్రతా నియమాల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని, డ్రంకన్ డ్రైవ్, రోడ్డు భద్రతా నియమాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. హత్యలు, హత్యాయత్నాలు, క్రైమ్ ఎగైనెస్ట్ ఉమన్, గర్ల్ మిస్సింగ్, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, తదితర కేసుల రికార్డ్సను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల్లో పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు తీరుతెన్నులు వాటి పురోగతిపై కేసుల ఫైల్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించి నిందితులు అరెస్ట్ కాని కేసులలో నిందితులను త్వరగా అరెస్ట్ చేయాలని ఆదేశించారు. సమన్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉంచకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన ముఖ్యమైన కేసులు, పాత గ్రేవ్ కేసులను సమీక్షించారు. స్టేషన్ లోని క్రైమ్ రికార్డ్సను, కేసు డైరీ, రిజిస్టర్‌లను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు. సివిల్, భూ తగాదాలు, పాత గొడవల్లోని, నాటు సారా అమ్ముతున్నారని అనుమానం ఉన్న వ్యక్తులను గుర్తించి బైండోవర్ చెయ్యాలని సూచించారు. అదే విధంగా పోలీసు స్టేషన్ పరిధిలో గల స్కూల్స్ వద్ద, హెూటల్స్ లాంటి ప్రదేశాలలో నిఘా ఏర్పాటు చేయాలని, ఎక్కువగా విజిబుల్ పోలీసింగ్ చేయాలని, సమర్ధవంతమైన నేర నియంత్రణ, నివారణ చర్యలు చేపట్టాలని, అదే విధంగా రాత్రి మరియు పగల బీట్ల పనితీరును నిరంతర మానిటరింగ్ చేయాలని, అప్పుడు నేరాలు తగ్గుతాయని తెలిపారు. అదే విధంగా రౌడీ షీటర్ల కదలికలు, కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, నేరాల అడ్డుకట్టకు నైట్ బీట్ వ్యవస్థను బలోపేతం చేయాలని, భూ వివాదాలు, పాత గొడవలు మొదలైన వాటిని లిస్ట్ అవుట్ చేసి ఎలాంటి నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళా పోలీసులు ఇంటింటికి వెళ్లి మహిళలపై జరుగుతున్న నేరాలు, కొత్త చట్టాలపై ప్రజలందరికీ అవగాహన కల్పించేలా వారి పరిధిలో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. అనంతరం స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతూ వారి ఉద్యోగ భాధ్యతలను వివరించి ప్రజలతో ఎలా మెలగాలనే దానిపై సూచించారు. పోలీసు స్టేషన్ సిబ్బందికి సంబంధించిన సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి డిపిఓలో పెండింగ్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను పరిశీలించి సత్వరమే పరిష్కారం చేస్తానని సిబ్బందికి హామీ ఇచ్చారు. చిత్తూరు ఎస్‌డిపిఓ రాజగోపాల్ రెడ్డి, డిసిఆర్‌బి ఇన్స్పెక్టర్ బాలయ్య, కల్లూర్ సిఐ శ్రీనివాసులు, ఐరాల ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

పుంగనూరును అభివృద్ధి చేస్తా : మంత్రి



ప్రజాశక్తి- సోమల: పుంగనూరు నియోజకవర్గం గత ఐదు సంవత్సరాలుగా అభివృద్ధిపరంగా ఎంతో వెనుకబడిపోయిందని, రాష్ట్రంలో ఏర్పడిన నూతన తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం పుంగనూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలబెట్టడానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని రవాణా యువజన క్రీడల శాఖమంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన సోమల మండలంలో 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీ కమ్మపల్లి గ్రామంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలుకగా మహిళలు మంగళ హారతులను అందజేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామి దర్శనానంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా పుంగనూరు నియోజకవర్గం దాడులు ప్రత్యర్థులపై కేసులు నమోదు చేయడం భూములదందా చేసి అభివృద్ధికి ఆటంకాలుగా మారారని, తమ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో పుంగనూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి తమ వంతు ప్రయత్నాలు చేస్తామని తెలిపారు. నియోజకవర్గ ఇన్చార్జి చల్లా బాబు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన బీసీ సెల్ అధ్యక్షులు



ప్రజాశక్తి- తవణంపల్లి : కాణిపాకం స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానానికి విచ్చేసిన మైన్స్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రని తవణంపల్లి మండల బీసీ సెల్ కమిటీ అధ్యక్షులు వినాయకం, టిడిపి సోషల్ మీడియా కోఆర్డినేటర్ శరవణ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి సన్మానించడం జరిగింది. కాణిపాకం స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకోవడం చాలా సంతోషకరమని మంత్రి తెలిపారు.

గంగమ్మ జాతరలో ఎమ్మెల్యే థామస్



ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ 49 కొత్తపలి మిట్ట గంగ జాతరలో ఎమ్మెల్యే డాక్టర్ థామస్ పాల్గొన్నారు. బుధవారం మండలం టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గంధమనేని జయశంకర్ నాయుడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు బ్యాండ్ మేళాలతో ఆహ్వానించారు. ఎమ్మెల్యే అమ్మవారికి నైవేద్యం సమర్పించి, దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం గంగమ్మ ఊరేగింపు వాహనాన్ని ఎమ్మెల్యే నడిపారు.

14 నెలల బకాయి వేతనాలు చెల్లించండి

- 22న కలెక్టరేట్ వద్ద ఆందోళన
- ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల యూనియన్ పిలుపు



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు బకాయి ఉన్న 14 నెలల వేతనాలు వెంటనే ఇవ్వాలని రాష్ట్ర వ్యాప్త పిలుపుమేరకు జిల్లాలో 22న కలెక్టరేట్ వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించన్నుట్లు యూనియన్ నాయకులు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం చిత్తూరులో జరిగిన జిల్లా సమావేశం యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు భారతి, జిల్లా గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు, జిల్లా కోశాధికారి హనుమంతు పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 300మంది ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు పనిచేస్తున్నారని వారికి గత ప్రభుత్వం వేతనాలు 14 నెలలుగా బకాయి పెట్టిందని వెంటనే విడుదల చేసి వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. 18 నెలలు బకాయి వుండగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేయగా రెండు నెలలు మాత్రమే విడుదల చేశారని మిగతా బకాయి ఉన్న వేతనాలు అన్నీ కూడా వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, నెలనెలా వేతనాలు ఇవ్వాలని తదితర సమస్యల పరిష్కారం కోసం 22న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమంలో జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు హర్షణీయం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- వి కోట: రాష్ట్రంలో ప్రజాపాలన మొదలైందని గతంలో జగన్ ప్రభుత్వం తెచ్చిన అత్యంత వివాదాస్పదమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు బిల్లుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడం హర్షణీయమని పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన వి కోటలోని పిఎంఆర్ కళ్యాణ మండపంలో బుధవారం తెలుగుదేశం పార్టీ క్లస్టర్ స్థాయి కార్యకర్తల సమావేశానికి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ నాడు ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు బిల్లుపై ఇటీవల మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమౌతున్నాయని అన్నారు. జగన్ ప్రభుత్వం చేపట్టిన భూముల రీ-సర్వే అమలును నిలిపేయడంతో పాటు, ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ ప్రివెన్షన్ యాక్ట్‌ను త్వరలోనే అమలు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడంతో కబ్జాదారుల్లో గుబులు మొదలైందన్నారు. గత ఐదేళ్లుగా జగన్ చేపట్టిన వ్యవస్థల విధ్వంసాన్ని చంద్రబాబు చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నారని, అస్తవ్యస్తంగా మారిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం పంచాయతీల వారి తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాబోవు రోజుల్లో మండల స్థాయిలోని అన్ని శాఖలలో అధికారులను ప్రక్షాళన చేసి అభివృద్ధి సంక్షేమ పనులను పరుగులు పెట్టిస్తామన్నారు. మండల అధ్యక్షుడు రంగనాథ్, రామచంద్ర నాయుడు, చౌడప్ప, సోము, ఇక్బాల్, నాగభూషణం, చంద్రారెడ్డి, విశ్వనాథ్, పోట్టు భాస్కర్, కార్యకర్తలు పాల్గొన్నారు.




సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి

ప్రతి మండల కేంద్రంలో బియ్యం, కందిపప్పు

విక్రయ కేంద్రాలు ఏర్పాటు : జెసి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:



ధరల పెరుగుదలను నియంత్రించుటకు చర్యలు చేపట్టడంలో భాగంగా ఈనెల 18 నుంచి ప్రతి మండల కేంద్రంలో బియ్యం, కందిపప్పు విక్రయకేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ ద్వారా ఆర్‌డిఓలు, డిఎస్ఓ, డిఎం సివిల్ సప్లైస్, మండలాల తహసీల్దార్లు, సిఎస్‌డిటిలతో బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ సంబంధించి తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో బహిరంగ మార్కెట్‌లో నిత్యవసర వస్తువుల ధరల నియంత్రణలో భాగంగా బియ్యం, కంది పప్పు, నూనెలను రైతు ఒజారులో ప్రత్యేక విక్రయ కేంద్రాలను తెరచి నాణ్యమైన బియ్యంను, స్టీము బియ్యం కేజి రూ.49ల, పచ్చి బియ్యం కేజి రూ.48లకు, నాణ్యమైన కందిపప్పు (దేశవాళి) కేజి రూ.160లు, పామోలిన్ నూనెను (ప్రియబ్రాండ్) లీటరు రూ.90లకు విక్రయించటం జరుగుచున్నదని తెలిపారు. ప్రతి మండలంలో నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించేందుకు హోల్సేల్ డీలర్లతో రిటైల్ షాప్స్, మార్కెట్ రిలయన్స్, ఇతర పెద్ద సూపర్ మార్కెట్లతో వారితో మాట్లాడి ప్రతి సూపర్ మార్కెట్‌లో విక్రయ కేంద్రాలను తెరిచి విక్రయించాలన్నారు. ఈనెల 18 నుండి కౌంటర్లను ప్రారంభించాలని సూచించారు. ఇందుకు రెవెన్యూ డివిజనల్ అధికారులు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, డిఎం పౌరసరఫరాల సంస్థ, తహశీల్దార్లు, ఉప తహసీల్దార్లు సమన్వయం చేసుకొని నాణ్యమైన బియ్యం, కందిపప్పును అందరికీ అందించేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

శాస్త్రీయ విద్య కోసం ఉద్యమించండి: ఎస్ఎఫ్ఐ

చదువు అనంతరం ఉపాధి కల్పించాలి : సమావేశంలో వక్తలు డిమాండ్



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నేడు విద్యార్థులకు అందుతున్న విద్య శాస్త్రీయంగా ఉండడం లేదని, చదువు అనంతరం ఉపాధి కల్పించే పద్ధతిలో లేవని శాస్త్రీయ విద్యకోసం విద్యార్థులు అందరూ ఉద్యమించాలని బుధవారం ఎస్టేట్లో ఉన్న సంక్షేమ హాస్టల్లో ఎస్ఎఫ్ఐ సమావేశంలో వక్తలు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు బాలసుబ్రమణ్యం, వాడ గంగరాజు, దాము, ఎస్ఎఫ్ఐ కన్వీనర్ వినోద్ కుమార్‌లు మాట్లాడుతూ నేడు ప్రభుత్వ విద్యను కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి విద్యార్థి మీద ఉందని తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటం చేస్తున్నదని అందులో మీరు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 15 పురస్కరించుకొని విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడానికి పాటలు, ఆటలు, ఉపన్యాస పోటీలు రకరకాల బహుముఖ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అందులో విద్యార్థులు పాల్గొని బహుమతులు పొందాలని తెలిపారు. దేశ స్వతంత్రానికి ప్రాణాలర్పించి పోరాటం చేసిన నాయకుల స్ఫూర్తితో నేడు మతోన్మాద పాలకుల కాషాయ విద్య నుండి కాపాడుకోవడానికి విద్యార్థి లోకం నడుం బిగించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలు హాస్టల్లో ఆధునీకరించి విద్యార్థులకు ఆధునిక విద్యపై నైపుణ్యం కలిగించే విధంగా విద్యావ్యవస్థపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఆగస్టు 15కు సంబంధించిన బహుమక కార్యక్రమాలలో విద్యార్థులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలేజీ, స్కూలు విద్యార్థులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

అన్ని రంగాల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా: ఎమ్మెల్యే



ప్రజాశక్తి- పెద్దపంజాణి: నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పనకు తొలి ప్రాధాన్యం, గ్రామ సమస్యలు పరిష్కరించే దిశగా తప్పక కృషి చేస్తానని ఎమ్మెల్యే నూతన కాల్వ అమర్నాథ్ రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం శంకుస్థాపన చేశారు. అనంతరం మాదనంపల్లి పంచాయతీలో కత్తర్లపల్లె నుంచి కర్ణాటక సరిహద్దు వరకు 2.15 కి.మీ మేర రూ 1.52 కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. అప్పినపల్లి పంచాయతీ కేంద్రంలో ఎన్టీఆర్ సుజల స్రవంతి కార్యక్రమంలో భాగంగా ఆర్వో ప్లాంటును ప్రారంభించారు. ఎన్నో ఏళ్ల నుంచి కత్తార్లపల్లె గ్రామస్తులు ఎదుర్కొంటున్న రోడ్డు సమస్య దీంతో పరిష్కారం కానుంది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల మేరకు ఎన్నికల ఫలితాల అనంతరం నెల రోజులలోనే అభివృద్ధి పనులపై అమర్నాథ్ రెడ్డి దృష్టి సారించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులోనూ అన్ని అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అంచెలచెలుగా పూర్తి చేసుకుందామని అన్నారు. మాజీ ఎంపీపీ విజయ భాస్కర్‌రెడ్డి, మండల అధ్యక్షులు ఆనంద, చలపతి, భానుప్రతాప్ రెడ్డి, శ్రీరాములు, చెంగారెడ్డి, సుధాకర్ రెడ్డి, రామకృష్ణ, సురేష్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- వి కోట: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన వైద్యసేవలను అందించాలని పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి సూచించారు. వీ.కోట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని బుధవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనికి చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఓపి శాతం ఎంత ఉందని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పేషెంట్లకు సరిపడా సౌకర్యాలు ఉన్నాయా అని ఆరా తీశారు. ఆస్పత్రిలో పోస్ట్ మార్టం గదిని ఏర్పాటు చేయించాలని వైద్యులు కోరారు. అదేవిధంగా పేషంట్లు అధిక సంఖ్యలో వస్తుండడంతో ఆసుపత్రిని వంద పడకలకు పెంచి అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రితో చర్చిస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వైద్యులకు తెలిపారు. ఇంకేమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆసుపత్రి అభివృద్ధికి సహకరిస్తానన్నారు. మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్, సీనియర్ నాయకులు రామచంద్ర నాయుడు, రాంబాబు, చౌడప్ప, ఈశ్వర్, యువ నాయకులు ధీరజ్, శబరీష్, ఆసుపత్రి వైద్యులు మురళీ ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రికి సామగ్రి వితరణ



ప్రజాశక్తి- విజయపురం (నగరి): స్థానిక ఓంశక్తి ఆలయంలో బుధవారం నిర్వహించిన ఆలయ 38వ వార్షికోత్సవం, 32వ గురుపాదోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ నిర్వాహకులు స్థానిక ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌కు చక్రాల కుర్చీలు, పరుపు దిండ్లు, బాలింతలకు బ్రెడ్లు, పండ్లు, బిస్కెట్లు, చెవిటి వారికి వినికిడి పరికరములు, వికలాంగులకు చేతికర్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెడికల్ సూపరింటెండెంట్ ప్రభావతి మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అన్న దృక్పథంతో ఓంశక్తి ఆలయ నిర్వాహకులు ఆస్పత్రికి, వికలాంగులకు పరికరాలు అందించడం అభినందనీయమన్నారు. మధ్యాహ్నం ఓంశక్తి ఆలయంలో సహపంక్తి భోజనం నిర్వహించారు. జిల్లా ఆదిపరాశక్తి ఆధ్యాత్మిక సేవాకమిటి అధ్యక్షులు టి.గంగాధరం, ఆర్ఎంవో కార్తికేయన్, వైద్యులు జరీనా, వైద్య సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



ప్రజాశక్తి- కార్వేటినగరం: ముక్కవానిపల్లి పంచాయతీ వైఎస్ఆర్సీపీ సర్పంచ్ గుణవతి, లోకనాథ నాయుడు దంపతుల కుమారుడు జ్ఞాన ప్రకాష్ రెండవ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన జ్ఞాపకార్థం మండల కేంద్రంలో రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుణవతి మాట్లాడుతూ ఇంటర్మీడియట్ చదువుతున్న జ్ఞానప్రకాష్ ఆకస్మిక మృతిని జీర్ణించుకోలేక పోతున్నామని, ఆయన జ్ఞాపకార్థ ప్రతి ఏటా వృద్ధులకు అన్నదానం, దుస్తుల పంపిణీ వంటి సేవాకార్యక్రమాలు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం పళ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహేష్, ఆదిలక్ష్మి, రాస్ కోఆర్డినేటర్ ప్రకాష్, విజయకుమార్ పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల పంచాయతీ దళితవాడలో పంచాయతీ వారిచే పారిశుద్ధ్య కార్మికుల ద్వారా గ్రామంలోని మురుగునీటి కాలువలను శుభ్రం చేసే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గ్రామంలో చెత్తాచెదారం పేరుకుపోయి మురుగునీరు పారేందుకు అవకాశం లేకుండా కాలువలలో నిండిపోవడంతో పంచాయతీ వారు డెంగీ, ఇతర వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ కార్యక్రమాలను నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి సుధాకర్ కుమార్ తెలిపారు. అదేవిధంగా తాగునీటి సరఫరా చేసే పైపులైన్లో లీకేజీలను అరికట్టేందుకు పైప్లైన్ మరమ్మతులను నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

భూసమస్యను పరిష్కరించిన ఆర్డిఓ



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మామిడి చెట్లు దౌర్జన్యంగా నరికేసిన స్థలాన్ని ఆర్డిఓ మనోజ్ కుమార్ రెడ్డి సిబ్బందితో కలిసి పరిశీలించారు. మండలంలోని టి.గడ్డూరు గ్రామానికి చెందిన నారాయణప్పకు రెవెన్యూ గ్రామపరిధిలో ఉన్న రెండు ఎకరాల 24 సెంట్లు భూమిలో ఉన్న మామిడి చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికేసిన సంగతి విధితమే. ఈ భూమికి సంబంధించి వివాదంపై పలమనేరు ఆర్డిఓ, తహశీల్దార్ స్వర్ణలత, వీఆర్ఓ గోపాలకృష్ణ సమక్షంలో నరికి వేసిన మామిడి చెట్లను పరిశీలించారు. రైతు పట్టా సాగులో ఉండిన, కనుక మళ్లీ మామిడి చెట్లు నాటుకోవచ్చని ఆర్డిఓ తెలిపారు. ఇరు వర్గాల వారు గొడవ పడకూడదని హెచ్చరించారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని ముద్దంపల్లి రోడ్డు క్రాస్ నుండి నాగిరెడ్డిపల్లి గ్రామం వరకు రూ.67 లక్షల వ్యయముతో నిర్మించనున్న రోడ్డుకు పలమనేరు నియోజకవర్గం ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎం గౌస్, పిఎయా ఏఈ విద్యాసాగర్, మండల అధ్యక్షులు కిషోర్ గౌడ్, ఉపాధ్యక్షులు సుబ్రమణ్యం, మాజీ సర్పంచ్ జైకుమార్ గౌడ పాల్గొన్నారు.

వేలంపాట ద్వారా ఆదాయం

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం మండలం నడుమూరు పంచాయతీ పెద్దవంక గ్రామంలో వెలసిన శ్రీ కనక నాంచారమ్మ దేవాలయానికి వేలంపాట ద్వారా ఆదాయం చేకూరిందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. గ్రామపరిధిలో ఆలయానికి సంబంధించి వాహనాలు నిలుపుటకు, వాణిజ్య సముదాయంకు సంబంధించి వేలంపాట నిర్వహించారు. 9 నెలల కాల పరిమితికి సంబంధించి జరిగిన వేలం పాటలో వాహనాల పార్కింగ్ వేలం పాట 1,79,000లు, వాణిజ్య సముదాయ దుకాణాలు రూ.21,600లు మొత్తం రూ.2,00600లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

'ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం'

ప్రజాశక్తి- కుప్పం టౌన్: శ్రీ బాలసుబ్రహ్మణ్య స్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేస్తామని తూర్పు రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి సభ్యులు డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఇంచార్జ్ పీఎస్ మునిరత్నం తెలిపారు. బుధవారం స్థానిక టిడిపి నాయకులతో కలిసి మండల పరిధిలోని నూలుకుంట గ్రామంలో వెలసిన శ్రీ బాల సుబ్రహ్మణ్య స్వామి దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, ఆలయ నిర్వాహకులు, పూజారుల బృందంతో కలిసి వారికి ఘనస్వాగతం పలికి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా తొలి ఏకాదశి

ప్రజాశక్తి - రామకుప్పం: మండల పరిధిలో బుధవారం తొలి ఏకాదశి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని కాశీ విశ్వేశ్వర స్వామి, సుబ్రమణ్య స్వామి, వేంకటేశ్వర స్వామి దేవాలయాల్లో, విజలాపురం వేణుగోపాల స్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అదేవిధంగా వెల్లగానిపల్లె గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో కూతాలకు భజన కీర్తనలు, రామకోటి నిర్వహించగా పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద అన్న దాన కార్యక్రమాలు చేపట్టారు.

కుష్టు వ్యాధి నిర్మూలనపై సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమలలో ప్రభుత్వ ఆదేశానుసారం కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈనెల 18వ తేదీ నుండి ఆగస్టు రెండవ తేదీ వరకు నిర్వహించ తలపెట్టిన కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమంపై మండలంలోని ప్రజాప్రతినిధులకు వైద్యశాలలోని క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ కార్యక్రమం గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించనున్నట్లు మండల వైద్యశాఖ అధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమల కందూరు పెద్ద ఉప్పరపల్లి ఆరోగ్య కేంద్రాల పరిధిలోని క్షేత్రస్థాయి సిబ్బంది, సర్పంచులు, ఎంపీటీసీలు మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమంకు హాజరుకావాలని తెలిపారు.

మరుగుదొడ్లకు తలుపుల్లేవ్.. 'మానం' పోయే..!



- విద్యార్థినుల బాధ వర్ణనాతీతం
- నిధుల్లేవన్నది హెచ్ఎం సమాధానం

ప్రజాశక్తి - సత్యవేడు: ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను ప్రతిష్ఠాత్మకంగా సిబిఎస్ఇ సిలబస్తో నిర్వహిస్తూ, ఫేస్ 1, ఫేస్ 2లుగా అప్గ్రేడ్ చేశారు. అదనపు తరగతి గదుల నిర్మాణం, ప్రహరీ, ఆటస్థలం, కిశోర బాలికలకు విశ్రాంతి గది, 16 మరుగుదొడ్ల నిర్మాణానికి కోటి 15 లక్షలు 'నాడు-నేడు' ద్వారా కేటాయించారు. సత్యవేడుకు చెందిన ఈ పాఠశాలలో మూడు గదుల నిర్మాణం అరకొరగా పూర్తయింది. 16 మరుగుదొడ్ల పునర్నిర్మాణం పనులు దాదాపు పూర్తయ్యాయి. అయితే అంతా పూర్తి చేసిన కాంట్రాక్టర్ తలుపులు పెట్టడం మరిచారు. దీంతో పాఠశాలలోని 160 మంది బాలికలు మరుగుదొడ్లకు వెళ్లాలంటే తంటాలు పడే పరిస్థితి. ఈ విషయమై ప్రధానోపాధ్యాయురాలు వి.వాణిని వివరణ కోరగా నిధుల విడుదల్లో జాప్యం వల్ల పనులు అర్ధాంతరంగా ఆగాయన్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తమ సొంత నిధులతో రెండు మరుగుదొడ్లకు తలుపులు నిర్మించామని, త్వరలో నిధులు విడుదలైతే బాలికల విశ్రాంతి గది తలుపులు కూడా పూర్తి చేస్తామన్నారు.

మొక్కులు తీర్చుకున్న తెలుగు తమ్ముళ్లు

ప్రజాశక్తి- వి కోట: రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, పలమనేరు ఎమ్మెల్యేగా అమర్నాథ్ రెడ్డి విజయం సాధిస్తే 1116 కొబ్బరికాయలు సమర్పిస్తామన్న మొక్కును బుధవారం తెలుగు తమ్ముళ్లు నెరవేర్చారు. మండల పరిధిలోని బోడిగుట్లపల్లి సర్పంచ్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో పంచాయతీ తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు గ్రామ సమీపంలోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో 1116 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

శ్రీరామప్ప మృతికి నివాళి



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు శ్రీరామప్ప బుధవారం మరణించారు. విషయం తెలుసుకున్న టిడిపి మండల అధ్యక్షులు కిషోర్ గౌడ్ ఉపాధ్యక్షులు సుబ్రమణ్యం శెట్టి రాజేష్. సురేష్ శంకరప్ప వెంగంవారిపల్లి గ్రామానికి చేరుకుని శ్రీరామప్ప మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి పగాడ సానుభూతి తెలియజేశారు.

మహిళకు గాయాలు



ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం పట్టణంలోని రైల్వే స్టేషన్లో ఢిల్లీకి చెందిన బుబీన అనే మహిళ గాయాలపాలయ్యింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఢిల్లీకి చెందిన బుబీన తన భర్తతో కలిసి కుప్పం పట్టణం మోడ్రన్ కాలనీలో నివాసం ఉంటున్న తన తమ్ముడి వద్దకు ఢిల్లీ నుంచి శేషాద్రి సూపర్ ఫాస్ట్ రైలులో బయలుదేరారు. కుప్పం రైల్వేస్టేషన్లో రైలు ఆగకముందే రైలు దిగడానికి ప్రయత్నించడంతో అదుపుతప్పి ప్లాట్ఫామ్ పై పడి తలకు దెబ్బలింది. సమయానికి అక్కడే ఉన్న విలేకరి తేజ్కిరణ్ వెంటనే సమాచారాన్ని రైల్వే పోలీసులకు అందజేశారు. సమాచారం అందుకున్న పోలీసులు బాధితురాల్ని ప్రథమ చికిత్స నిమిత్తం రైల్వే వైద్య అధికారి వద్దకు తీసుకెళ్లి చికిత్స అందించారు.

బీసీ హాస్టల్ సమస్యలపై ఎంపికి వినతి



ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట బీసీ హాస్టల్ వీధిలైట్లు వెలగక నిర్మానుష్యంగా, వెళ్లడానికి వీల్లేకుండా ముళ్లకంపలతో నిండి ఉందని ఎస్ఎఫ్ఐ, జెవివి నాయకుల ఆధ్వర్యంలో విద్యార్థులు ఎంపి మద్దిల గురుమూర్తిని కలిసి వినతిపత్రం సమర్పించారు. జెవివి నాయకులు ఒ.వెంకటరమణ, కుప్పస్వామి మాట్లాడుతూ రేణిగుంట బీసీ హాస్టల్కు వెళ్లదారి గుంతలమయమై వీధి దీపాలు వెలగడం లేదని, రాత్రుల్లో వెళితే పడిపోక తప్పదన్నారు. మరుగుదొడ్లు సరిగా లేవన్నారు. ఆర్ఓ ప్లాంట్ ఉపయోగంలో లేదన్నారు. కలుషిత నీరు తాగి అతిసార వ్యాధి బారిన పడిన విషయాన్ని వివరించారు. ఎంపి స్పందిస్తూ కొత్త ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటుకు హామీ ఇచ్చారు. బాగా చదువుకుని అభివృద్ధిలోకి రావాలన్నారు. వార్డెన్ చైతన్య, విద్యార్థులు నరేష్, రవీంద్ర, గణేష్, సంతోష్, కార్తీక్, బాలాజీ, యువరాజ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

లడ్డూల తయారీపై అపోహలొద్దు: టిటిడి

ప్రజాశక్తి - తిరుమల

అనాదిగా తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని శ్రీ వైష్ణవ బ్రాహ్మణులే తయారు చేస్తున్నారని, లడ్డూ తయారీపై ఎటువంటి అపోహలొద్దని టిటిడి ఓ ప్రకటనలో పేర్కొంది. సోషల్ మీడియా వేదికగా టిటిడిపై అసత్య ప్రచారాలు చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. శ్రీవారి పోటులో 980 మంది హిందూమతానికి చెందిన పోటు కార్మికులు తమకు నిర్దేశించిన వివిధ విధులను నిర్వహిస్తున్నారని తెలిపింది. ఇటీవల సోషల్ మీడియా వేదికగా శ్రీవారి లడ్డూ ప్రసాదాలను థామస్ అనే కాంట్రాక్టర్ ఆధ్వర్యంలో తయారు చేస్తున్నారని అసత్య ప్రచారాన్ని ఖండించారు. భక్తులు నమ్మరాదని కోరింది.

'విజయసాయి రెడ్డిని అరెస్టు చేయాలి'



ప్రజాశక్తి- కుప్పం టౌన్: విలేకరులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిని వెంటనే అరెస్టు చేయాలంటూ కుప్పం ప్రెస్క్లబ్ సభ్యులు నిరసన కార్యక్రమాన్ని తెలియజేశారు. ముందుగా పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం విజయసాయిరెడ్డికి ప్రతికూలంగా నినాదాలు చేస్తూ పోలీస్స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి, సిఐకి ఫిర్యాదు చేశారు. అనంతరం పలువురు విలేకరులు మాట్లాడుతూ బాధ్యతాయుతమైన రాజ్యసభ సభ్యుడిగా ఉన్న వ్యక్తి విలేకరుల పట్ల గౌరవంగా మాట్లాడడం బాధాకరమన్నారు. ఇకపై ఎంతటి వారైనా విలేకరులను అగౌరవంగా మాట్లాడితే ఊరుకునేది లేదని, విలేకరులంతా ఐక్యమత్యంగా పోరాడుతామని హెచ్చరించారు. అతను వెంటనే విలేకరులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహా టివి భూపతి, 10 టీవీ రాజు, వార్త అస్గర్, ఆంధ్రనాడు లక్ష్మీపతి, టీవీ5 శివ, ఏబీఎన్ శ్రీనాథ్, ఐ న్యూస్ కుమార్, వార్త ఆనంద్, ఉదయం లక్ష్మీనారాయణ, బిఆర్కే న్యూస్ హరి, రాజ్ న్యూస్ ప్రశాంత్, ఆర్టీఐ ఎక్స్ప్రెస్ ఖలీం, ఎన్3 న్యూస్ తరుణ్, బిగ్ టీవీ మురళీ, తేజ న్యూస్ తేజ్ కిరణ్, స్వతంత్ర టీవీ దుర్గ ప్రసాద్, ఈనాడు కార్తీక్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఘనంగా మొహరం



ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: మండల పరిధిలోని ఆవలకొండలో మొహరం పండుగ సందర్భంగా షియా ముస్లింలు బాధతో పీర్లను ఊరేగించి రక్తతర్పణం నిర్వహించారు. పూర్వం యజీద్ అనే పాలకుడు ఇమామ్ హుస్సేన్ అతని కుటుంబసభ్యులతో పాటు అనుచరులు, అభిమానులను కొంతమందిని బలిగొన్నారు. వీరి ప్రాణత్యాగాన్ని గుర్తించుకుంటూ, తూగుండ్రం పంచాయతీ ఆవలకొండలోని అంజుమన్ అబ్బాసియా కమిటీ, అబ్బాసియా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మతగురువులు మౌలానా అబీదలీ, నబీల్ మిర్జా అధ్యక్షతన పలువురు ముస్లిములు బుధవారం నల్లబట్టలు ధరించి కుటుంబంలోని పురుషులందరూ పీర్లు ఊరేగిస్తూ తమ ఛాతిపై, వీపుపై బ్లేడ్లు, చిన్న చాకులతో రక్తగాయాలు చేసుకుని రక్తాన్ని చిందిస్తూ ఇమామ్ హుస్సేన్ సేవలను స్మరిస్తూ , ఆవలకొండ నుంచి ఫకీరుతోట వరకు ర్యాలి నిర్వహించారు. పీర్లుతో పాటు పలువురు షియా ముస్లింలు అగ్ని గుండం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సీఐ కుళ్ళాయప్ప, ఎస్ఐలు రామాంజనేయులు, ఉమామహేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. అంజుమన్ అబ్బాసియా కమిటీ అధ్యక్షుడు ఎస్హెచ్ నియాజ్అలీ, వైస్ ప్రెసిడెంట్ యగ్బాల్ హుస్సేన్, కార్యదర్శి రహమత్ అలీ, కోశాధికారి షాకిర్, అబ్బాసియా చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ గులాం హుస్సేన్ పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోండి

అసిస్టెంట్ జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి



ప్రజాశక్తి- పెద్దపంజాణి: గ్రామాల్లో దోమల నివారణకు పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య నిర్మూలనకు కృషి చేస్తూ, దోమల నివారణకు క్లోరినేషన్ చేయాలని అసిస్టెంట్ జిల్లా మలేరియా వైద్య అధికారి రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు ఆయన మండలంలోని బసవరాజు కండ్రిగలో పర్యటించారు. స్థానిక సర్పంచ్ రమేష్ బాబు ఆధ్వర్యంలో రాయలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది సహకారంతో ఇంటింటికి వెళ్లి జ్వరాలు ఉన్నాయా అని ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో, పట్టణాల్లో ఎవరికైనా జ్వరాలు వ్యాపిస్తే ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే మెరుగైన వైద్య చికిత్సలు అందుతున్నాయని, అలాకాకుండా ఆర్ఎంపి, పిఎంపిల వద్దకు వెళ్లి డబ్బులు వృధా చేసుకోవడంతో పాటు జ్వరాలు కూడా తగ్గు ముఖం కాకపోగా, డెంగీ లక్షణాలు ఉన్నాయంటూ కొంతమంది ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అలాంటి వారి మాటలు నమ్మకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వైద్య చికిత్సలు నిర్వహించుకోవాలని తెలిపారు. వారానికి ఒకరోజు తప్పక డ్రైడే పాటించాలని సూచించారు. సర్పంచ్ రమేష్ బాబు, మలేరియా సబ్యూనిట్ అధికారి గంగయ్య, ఎంపీహెచ్ఓ శ్రీనివాసులు, ఏఎన్ఎం సుజాత, ఆశా వర్కర్ లలిత తదితరులు పాల్గొన్నారు.



బైరెడ్డిపల్లి: మండలంలో పాతపేట గ్రామంలో డాక్టర్ విజయచంద్ర ఆధ్వర్యంలో జర్వాల నివారణకు ఇంటింటి సర్వే నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో దోమ నివారణకు చర్యలు చేపట్టాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అలాగే తాగునీటిని కాచి వడగట్టి తాగాలని, దోమ కాటు నుంచి దోమతెరలు, వేపాకు వేసి పొగ వంటివి చేయాలన్నారు. గ్రామంలో ఎవరికైనా జ్వరం వస్తే వెంటనే స్థానిక పిహెచ్కి వెళ్లి వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రి, సిబ్బంది నిరుపమ, అరబ్ జామ్ బేగం, అంబికా పాల్గొన్నారు.

నితిన్ గడ్కరీకి ఘన స్వాగతం

ప్రజాశక్తి - రేణిగుంట

రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న కేంద్ర రోడ్డు రవాణా, హైవేస్ క్యాబినెట్ మంత్రి నితిన్ గడ్కరీకి ఘన స్వాగతం లభించింది. ఎపి ఆర్ అండ్ బి మంత్రి బిసి జనార్ధన్రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, తిరుపతి ఎంపి మద్దిల గురుమూర్తి, ఎంఎల్ఎలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, బొజ్జల సుధీర్రెడ్డి, ఎయిర్పోర్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, ప్రోటోకాల్ ఎస్డిసి రాంమోహన్ పాల్గొన్నారు. జాతీయ రహదారులపై అధికారులతో సమీక్షించి, మదనపల్లికు హెలికాప్టర్లో బయల్దేరి వెళ్లారు. బుధవారం రాత్రి తిరుమల చేరుకుని, గురువారం తెల్లవారుజామున శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణం కానున్నారు. ఈ సందర్భంగా ఎంపి మద్దిల గురుమూర్తి పలు రహదారుల విస్తరణపై విఐపి లాంజ్లో వినతిపత్రం ఇచ్చారు. బుధవారం రాత్రి తిరుమల చేరుకున్న ఆయనకు ఈవో స్వాగతం పలికారు. గురువారం తెల్లవారుజామున స్వామివారిని దర్శించుకోనున్నారు.

క్రైం న్యూస్

ఐదుగురు నిందితులు అరెస్టు



ప్రజాశక్తి- గంగవరం: గంగవరం, పంజాణి మండలాల్లో గత రెండు జరిగిన పందుల వరుస దొంగతనాల నేపథ్యంలో గంగవరం సిఐ చిన్న గోవిందు, ఓ దర్యాప్తు బృందం ఏఎస్ఐ శ్రీనివాసులుతో మరో బృందం దర్యాప్తు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో మంగళవారం మదనపల్లి శివార్లలో ముద్దాయిలు గురించి అందిన సమాచారం మేరకు మదనపల్లి మండలం, నిమ్మనపల్లి క్రాస్ వద్ద ఐదుగురు ముద్దులను అదుపులోకి తీసుకున్నారు. అలాగే చోరీకి గురైన 35 పందులను, రెండు వాహనాలను, ఓ బైక్ను స్వాధీనం చేసుకున్నారు. సదరు ముద్దాయిలు ఇచ్చిన సమాచారం మేరకు గతంలో కూడా అనంతరపురం జిల్లాలో పందుల దొంగతనాలు చేయడంలో అనుభం ఉండి, గత రెండు నెలల్లో గంగవరం, పంజాణి మండలాల్లో సుమారు 112 పందులను దొంగతనం చేసిన వాటిని లగేజీ వాహనాల్లో మదనపల్లి శివార్లలో పందులు వ్యాపారం చేసేవారికి ఒక కేజీని రూ.190లకి అమ్మినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుండి దొంగతనం అయిన 82 పందులు, పందులు అమ్మిన డబ్బు రూ.1,71,000లు రికవరీ చేసినట్లు తెలిపారు. చోరీ కేసులలో ముద్దాయిలు ను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన శ్రీనివాసులు, అశోక్, అల్లా ఉద్దిన్, శశిధర్, శేషాచలంలను పైఅధికారులు అభినందిచడమే కాకుండా రివార్డులకు కూడా సిఫారసు చేయడమైనదన్నారు. అనంతరం ముద్దాయిలు అనంతరపురం జిల్లా రాప్తాడు మండలంకు చెందిన ఎరికల చంద్రశేఖర్ (30), దేరంగుల విజయ్ (20), ఎరుకుల వాసు (22), బెస్త రాకేష్ (22), శెట్టి సురేంద్ర (21)లపై కేసు నమోదు చేసి, రిమాండ్కు తరలించినట్లు తెలిపారు.

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్టు



ప్రజాశక్తి- ఐరాల: ఐరాల మండల పరిధిలో ద్విచక్ర వాహనాల అంతర్రాష్ట్ర దొంగను మద్దిపట్లపల్లి వద్ద అరెస్టు చేసిన రూ.8 లక్షల విలువచేసే 12 ద్విచక్ర వాహనాలను కాణిపాకం పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు చిత్తూరు వెస్ట్ సిఐ రవిశంకర్ రెడ్డి విలేకరుల సమావేశంలో తెలిపారు. బుధవారం ఎస్ఐ రామ్మోహన్ సిబ్బందితో కలిసి మద్దిపట్లపల్లి వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇది వరకు నిందితుడు కోటీశ్వర్ చిత్తూరు, బంగారుపాళ్యం, తవణంపల్లి, ఐరాల, తిరుపతి, తిరుచానూరు, పెనుమూరు, యాదమరి, రేణిగుంట, కాణిపాకం ప్రాంతాలలో ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడేవాడని తెలిపారు. బంగారుపాళ్యం మండలం బండ్లదొడ్డి గ్రామానికి చెందిన కోటీశ్వర్ అలియాస్ కోటిను చాకచకంగా అరెస్టు చేసిన కాణిపాకం ఎస్ఐ రామ్మోహన్ సిబ్బందిని సిఐ రవిశంకర్ రెడ్డి అభినందించారు.

మద్యం మత్తులో దూడను చంపిన వ్యక్తి





ప్రజాశక్తి- గుడిపల్లి: మద్యం మత్తులో ఓ లేగ దూడను ఓ వ్యక్తి చంపిన ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని సాలచింతనపల్లి సమీపంలోని బెంగుళూరప్ప పంట పొలంలో ఉన్న లేగ దూడను ఒంటిపల్లి గ్రామానికి చెందిన సుబ్రమణి (45) గల వ్యక్తి మద్యం మత్తులో గొంతును నులిమి నోటితో కరిచి చంపేసినట్లు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు అక్కడికి చేరుకొని అతన్ని చెట్టుకు కట్టివేసి స్థానిక పోలీసు స్టేషన్లో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సుబ్రమణిని అరెస్టు చేసి స్టేషన్కు తరలించారు.

నీటి కుంటలో పడి వృద్ధురాలు మృతి



ప్రజాశక్తి- సోమల: సోమల మండలం పెద్దఉప్పరపల్లి గ్రామానికి చెందిన అమీనాభి (62) అనే వృద్ధురాలు మూడు రోజుల క్రితం కనిపించకుండా పోయింది. బుధవారం ఉదయం గ్రామ సమీపంలోని చిన్నకంపల్లి మార్గంలోని గార్గేయ నదిలో ఓ నీటి కుంటలో శవమై తేలింది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం వృద్ధురాలు మతిస్థిమితం లేకుండా తిరుగుతూ ఉంటుందని ఈ క్రమంలో అటువైపు వెళ్లి ప్రమాదవశాత్తు నీళ్లలో పడి మృతి చెంది ఉండవచ్చునని, ఆమెకు ఎవరూ లేరని తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ముళ్ళపోదల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

ప్రజాశక్తి- శాంతిపురం: మండలం రాళ్ళబూదుగూరు వద్ద ద్విచక్ర వాహనాన్ని తప్పించిపోయి ముల్లుపదల్లోకి ఆర్టీసీ బస్సు దూసుకెళ్లింది. కుప్పం ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు కుప్పం నుండి కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్కు ప్రయాణికులతో వెళ్తుండగా పెట్రోల్ బంకు దగ్గర ఉన్న మలుపు వద్ద ద్విచక్ర వాహనదారుడు అతివేగంగా రావడంతో ద్విచక్ర వాహనం తప్పించిపోయి డ్రైవర్ చాకుచక్యంగా ప్రయాణికులకు ఎలాంటి ప్రాణాపాయం లేకుండా రోడ్డు పక్కనున్న ముళ్ళ చెట్ల పొదలలో పోనిచ్చాడు. ప్రయాణికులకు తేలికపాటి గాయాలతో తప్పించుకున్నారు. ఎస్కార్ట్ సహాయంతో బస్సును చెట్లపొదల నుండి వెనకకు తీశారు.

